## చెలి



టెస్ట్‌ట్యూబ్ విధానానికి ఇరవై అయిదు సంవత్సరాలు నిండాయి. 1978 సంవత్సరంలో మొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీ జన్మించిన తర్వాత ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా పది లక్షలకు పైగా పిల్లలు ఈ విధానంలో జన్మించారు. సంతానం కలగక నిరంతరం వేదనకు గురయ్యే వేలాది మంది దంపతులకు టెస్ట్‌ట్యూబ్ విధానం వరప్రసాదం అంటారు డాక్టర్ **రోయా రొజాటి.** అనేక జాతీయ అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్న డాక్టర్ రోయారొజాటి హైదరాబాద్‌లో స్థిరపడిన ఇరాన్ దేశీయురాలు. సంతానం కలుగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, అంత మాత్రాన ఇక సంతానం కలుగదని కృంగిపోవడం సబబు కాదని ఆమె అభిప్రాయం. కృత్రిమ గర్భధారణ పట్ల ప్రజలలో ఉన్న అనేక సందేహాలు అర్థంలేనివని చెప్పే డాక్టర్ రోయా, అవన్నీ అవగాహనలోపంతో ఏర్పడుతాయని అన్నారు. చాలా మంది దంపతులు అనేక రకాల అవగాహనలోపాలతో కృత్రిమ విధానం ద్వారా సంతానం పొందడానికి ముందుకు రావడం లేదన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 'సెంటర్ ఫర్ ఫర్టిలిటీ మేనేజ్‌మెంట్' కేంద్రం ద్వారా ఇప్పటి వరకూ2 వేల మందికి పైగా దంపతులకు సంతాన భాగ్యాన్ని ప్రసాదించిన డాక్టర్ రోయా రొజాటితో జరిపిన ఇంటర్వ్యూ..

# నిస్సంతు దంపతులకు వరం

**టెస్ట్ ట్యూబ్ బేబీ విధానం గురించి స్థూలంగా వివరించండి.**

శాస్త్రీయంగా 'ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్' (ఐవిఎఫ్) విధానంగా పిలిచే ఈ విధానాన్ని ప్రఖ్యాత గైనకాలజిస్ట్ డాక్టర్ ప్యాట్రిక్ స్టెప్టో, డాక్టర్ రాబర్ట్ ఎడ్వర్డ్స్‌లు కనుగొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిస్సంతులకు వరమానందాన్ని కలిగించిన ఈ విధానం అనతి కాలంలోనే బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. భారతదేశంలో 1986 సంవత్సరంలో ఈ విధానంఅమలులోకి వచ్చింది. ఆ తర్వాత చాలా మంది వైద్యనిపుణులు ఈ విధానం ద్వారా టెస్ట్‌ట్యూబ్ బేబీలను పుట్టించగలిగారు. స్థూలంగా చెప్పాలంటే ఆరోగ్యవంతురాలైన మహిళ గర్భాశయంలోకి అండాన్ని ప్రవేశపెట్టి ఫలదీకరించడమే ఐవిఎఫ్ విధానం. ఈ విధానంలో పరాయి పురుషుల వీర్యాన్ని వాడటం జరుగుతుందన్న ప్రచారం ఉంది. అందులో నిజం లేదు. ఒక రకంగా చెప్పాలంటే సంతానలేమికి కారణమయ్యే మార్గాలను అధిగమించడానికి టెస్ట్‌ట్యూబ్ బేబీ విధానం ఉపయోగపడ్తుంది. కొన్ని సందర్భాలలో ఐవిఎఫ్ విధానం ద్వారా మొదటి సంతానం పొందిన దంపతులకు రెండవసారి ఆ అవసరం ఏర్పడదు. రెండవ బిడ్డను సహజమైన విధానంలో కలిగే అవకాశం ఉంది. ఇలా జరిగిన సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా ఏకకాలంలో ముగ్గురు(ఇద్దరు అమ్మాయిలు, ఒక బాబు) టెస్ట్‌ట్యూబ్ బేబీ(కవల)లకు జన్మనిచ్చిన తల్లులు కూడా ఉన్నారు. 1997, 2000 సంవత్సరంలో ఇద్దరు, ముగ్గురు పిల్లలు మా సెంటర్‌లో జన్మించారు.

**ఈ విధానంలో నూటికి నూరుపాళ్ళు సంతానం కలిగే అవకాశం ఉంటుందంటారా?**

అలా అని ఖచ్చితంగా చెప్పలేం. పేషంట్ ఎంచుకునే వైద్యవిధానంపై సక్సెస్ రేటు ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు హార్మోనల్ మానిప్యులేషన్ అండ్ ఒవలేషన్ ఇండక్షన్ విత్ టైమ్డ్ ఇంటర్‌కోర్సు విధానంలో 60శాతం సంతానసాఫల్యం కలుగుతుంది. సాధారణంగా చాలా మంది మగవారు సంతానలేమికి కారణం తాము కాదని భార్యలో ఏదో లోపం ఉన్న కారణంగానే సంతానం కలుగలేదని భావిస్తారు. ఇది వాస్తవం కాదు. సంతానలేమికి అనేక కారణాలు ఉంటాయి. ఇందుకు సంబంధించిన పూర్తివివరాలను దంపతులిద్దరిని పరిశీలిస్తే తప్ప నిర్ధారించడం కష్టం. ఆయా సమస్యను బట్టి చికిత్స ప్రారంభించవలసి ఉంటుంది. చికిత్స విధానాన్ని బట్టి సక్సెస్ రేటు ఆధారపడి ఉంటుంది.

**ఈ విధానం ఖరీదైనదన్న అభిప్రాయం ఉంది. ఇందుకు మీరేమంటారు?**

టెస్ట్‌ట్యూబ్ విధానం అమలులోకి వచ్చి 25 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇది ఖరీదైన చికిత్సగానే నిలిచిందన్నది కాదనలేని సత్యం. అయితే సంతానలేమిచికిత్సకుగానూ చాలా మంది నేరుగా సరైన వైద్యనిపుణులను సంప్రదించడంలేదు. ఈ రకంగా చాలా డబ్బును వృధా చేశాక వైద్యనిపుణులను సంప్రదించడం జరుగుతుంది. అలా కాకుండా ముందుగానే నిపుణులను కలిస్తే సత్ఫలితాలు పొందవచ్చు. మరో ముఖ్యవిషయమేమంటే వైద్య శాస్త్రంలో వస్తున్న అనేకానేక మార్పుల కారణంగా క్రమంగా టెస్ట్‌ట్యూబ్ బేబీ వైద్య ఖర్చులు తగ్గే అవకాశం ఉంది.

**సంతానలేమికి కారణం చాలా వరకు పురుషులలోని లోపాలే అన్నారు. వివరిస్తారా?**

మగవారిలో ఉండే 'క్సెనో ఈస్ట్రోజన్' అన్న హార్మోన్ లోపం సంతానలేమికి ప్రధాన అవరోధంగా నిలుస్తుంది. ప్రతి రెండు వందల మందిలో ఒక పురుషుడు ఈ రకమైన లోపంతో బాధపడ్తున్నారు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న కృత్రిమ ఎరువుల వినియోగం ఈ పరిస్థితికి దారి తీస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 35 సంవత్సరాల వరకూ చాలా మంది పురుషులు సంతానలేమిని తీవ్రంగా పరిగణించరు. ఇది దౌర్భాగ్యం. 36 సంవత్సరాల వయసు తర్వాత 'ఇస్ట్రోజన్' హార్మోన్ లోపం కలిగిన పురుషులకు చికిత్స చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదు.

**ఐవిఎఫ్ చికిత్స తీసుకోవడానికి వయోపరిమితి ఎంత?**

నిపుణుల అంచనా ప్రకారం ఐవిఎఫ్ చికిత్స ద్వారా 35 సంవత్సరాల వయస్సు వరకు 40%, 35-39 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలలో 35-38%, నలభై సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలలో 20-25%, 41 సంవత్సరాల వయస్సు దటిన వారిలో 18%, 42 వయస్సు కలిగినవారిలో 10%, 43 సంవత్సరాల వయస్సులో 5%కన్నా తక్కువ, 44 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలలో 2%, 45 సంవత్సరాల వయస్సు దాటినవారిలో ఒకశాతం కన్నా తక్కువగా సత్ఫలితాలను సాధించవచ్చని తేలింది. 35 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీపురుషులు ఇరువురు ఈ చికిత్స ద్వారా చక్కటి ఫలితాలను సాధించవచ్చు.